క్లుప్తంగా

ప్రజలకు అవగాహన కల్పించాలి

నేరడిగొండ: సికిల్‌సెల్ ఎనీమియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సద్దాం అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సికిల్‌సెల్ అనేది జన్యుపరంగా వస్తుందని, వ్యాధి సోకిన వారికి రక్తహీనత సమస్య ఉంటుందన్నారు. వేసవిలో వడదెబ్బ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలని సూచించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తాంసి: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని భీంపూర్ పోలీసులు శుక్రవారం అవగాహన కల్పించారు. మండలంలోని నిపాని గ్రామంలో గ్రామ ప్రజలకు మత్తుపదార్థాల ఉపయోగం వలన కలిగే అనర్థాలను వివరించారు. గుట్కా, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

జిల్లా విద్యార్థి ప్రతిభ

ఆదిలాబాద్‌టౌన్: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ పరీక్షల్లో జిల్లా విద్యార్థి ప్రతిభ కనబర్చింది. ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న సీర్ల అక్షయ గ్రాంట్ ప్రైజ్ లెనోవో ల్యాప్‌టాప్‌ను దక్కించుకుంది. శుక్రవారం జిల్లా విద్య శాఖ అధికారి ఏనుగు శ్రీనివాస్ రెడ్డి విద్యార్థికి డీఈఓ కార్యాలయంలో ల్యాప్‌టాప్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో సోమయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయుడు మూగ నవీన్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి

బోథ్: సొనాల మండలంలోని చింతల్‌బోరి గ్రామంలోనే రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ మల్లేష్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో గ్రామంలో సిగ్నల్ లేకపోవడంతో గ్రామంలో రేషన్ ఇవ్వకుండా, సొనాల గ్రామంలో రేషన్ ఇచ్చేవారని అన్నారు. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ అందుబాటులో ఉందని, గ్రామంలోనే రేషన్ ఇవ్వాలని కోరారు.

జొన్న కొనుగోళ్లు ప్రారంభించాలి

బోథ్: బోథ్ వ్యవసాయ మార్కెట్‌లో ప్రభుత్వం జొన్న కొనుగోళ్లను ప్రారంభించాలని ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్, భీమ బుచ్చన్నలు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ సూరజ్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన జొన్న పంటను పూర్తిగా ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి నష్టపోకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భీమ బుచ్చన్న, మడావి మారుతి, మడావి భీంరావ్, మహేందర్ పాల్గొన్నారు.

స్పాట్ రెమ్యునరేషన్ చెల్లించాలి

ఆదిలాబాద్‌టౌన్: గతేడాది పదో తరగతి మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు స్పాట్ రెమ్యునరేషన్ చెల్లించాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలేందర్ రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా విద్య శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి మూల్యాంకానికి ప్రతీ పాఠశాల నుంచి 50 శాతం మించకుండా ఉపాధ్యాయులకు విధులను కేటాయించాలని కోరారు. ఈనెల 9 నుంచి వార్షిక పరీక్షలు జరగనున్నాయని, దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బలరాం, లింగా రెడ్డి, జగన్, రామారావు, లచ్చ రెడ్డి, పండరినాథ్, రాజారాం, నాగన్న, రవీందర్ రెడ్డి, చందర్ రెడ్డి, ప్రఫుల్ పాల్గొన్నారు.

నేలకొరిగిన జొన్న

నేరడిగొండ: రబీలో సాగు చేస్తున్న జొన్న, నువ్వు పంటలు అకాల వర్షాలతో దెబ్బతిన్నాయి. గురువారం రాత్రి కురిసిన వర్షానికి వాంకిడి, వడూర్, కుమారి, తర్నం, వాగ్దారి గ్రామాల్లో పంటలు నేలకొరిగాయి. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. కాగా అకాల వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచించారు.

కరీంనగర్ పోలీసు కమిషనర్‌కు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: సనాతన హిందు ఉత్సవ సమితి సభ్యులు కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలంను సన్మానించారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. జిల్లాలో ఎస్పీగా పనిచేసిన కాలంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రమోద్ కుమార్ ఖత్రి, గెడం మాధవ్, పడకంటి సూర్యకాంత్, కందుల రవీందర్ ఉన్నారు.

వేసవిలో కూల్.. కూల్‌గా..!



అమ్మకానికి సిద్ధంగా కూలర్లు

- కూలర్లకు పెరిగిన గిరాకీ
- ధరలు అందుబాటులో ఉండడంతో డిమాండ్

ఆదిలాబాద్: ఎండ వేడి నుంచి ప్రజలు ఉపశమనం పొందేందుకు కూలర్లు, ఏసీల కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే కూలర్ల దుకాణాలు కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నాయి. ఏసీలను ధనవంతులు ఆర్థిక స్థోమత ఉన్న వారు మాత్రమే కొనుగోలు చేస్తుండగా.. ఎగువ, దిగువ మధ్యతరగతి, నిరుపేదలు కూలర్లను కొంటున్నారు. స్థానికంగానే తయారు కావడం మిగతా ఫైబర్ కూలర్ల కంటే తక్కువ ధరకు వస్తుండడంతో గిరాకీ పెరిగింది.

స్థానికంగానే తయారీ..

వేసవిలో ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. దీంతో వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు శీతలీకరణ ఉపకరణాలు అయిన కూలర్లు, ఏసీలు ఇంటికి తీసుకు వస్తారు. జిల్లాలో సామాన్య ప్రజానీకం తమ స్థోమతకు తగ్గట్టుగా కూలర్లను ఖరీదు చేస్తారు. ఒకసారి కొనుగోలు చేస్తే వచ్చే వేసవికాలం వరకూ చిన్నపాటి రిపేర్ చేసుకుంటే తిరిగి కొత్త దానిలా పనిచేయడంతో వీటి వైపే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఫైబర్ కూలర్లతో పోలిస్తే ఎక్కువ చల్లదనాన్ని సైతం ఇవ్వడంతో వీటికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.

యువతకు ఉపాధి..

స్థానికంగానే తయారు చేస్తుండడం వలన ఎంతో మంది యువతకు ఉపాధి అవకాశాలు లభ్యమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఎంతో మంది వీటి తయారీలో నైపుణ్యం కలిగి ఉండడం, ఎడారి కూలర్లకు జిల్లాలో ఉన్న డిమాండ్ కు తార్కానంగా నిలుస్తోంది. వేసవి వస్తే నైపుణ్యం గల యువత తయారీ యూనిట్లతోపాటు కూలర్ రిపేరింగ్ షాపులతో ఉపాధి పొందుతున్నారు.

అందుబాటు ధరల్లో..

వివిధ బ్రాండ్ కంపెనీలకు చెందిన ఫైబర్ కూలర్లు మార్కెట్లో రూ. 10 వేల నుంచి రూ. 25 వేల వరకు లభ్యం అవుతున్నాయి. అయితే ఎడారి కూలర్లు రూ. 1800 నుంచి రూ. 6000 వరకు మాత్రమే ఖరీదు చేస్తున్నాయి. ఫైబర్ బ్రాండ్ కంపెనీ కూలర్ల కన్నా ఎక్కువ చల్లదనాన్ని ఇస్తుండడం, సామాన్యులకు అందుబాటు ధరల్లో ఉండడంతో వేసవి వస్తే కూలర్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి.

నాణ్యతకు అధిక ప్రాధాన్యం



26 సంవత్సరాలుగా కూలర్ల తయారీ వ్యాపారంలో ఉన్నాను. ఫైబర్ కూలర్లతో పోలిస్తే ఎంతో నాణ్యంగా తయారు చేసేందుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాం. ఎంతోమందికి ఉపాధి అవకాశాన్ని ఈ కూలర్ల తయారీ రంగం జిల్లాలో దిక్సూచిగా నిలుస్తుంది. రోజుకు 40 కూలర్ల వరకు ఉత్పత్తి ఉంటుంది. – మహేంద్ర, కూలర్ తయారీ వ్యాపారి, ఆదిలాబాద్

శోభాయాత్రకు తరలి రావాలి



విగ్రహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని ఈనెల 6న నిర్వహిస్తున్న భారీ శోభాయాత్రకు హిందువులు భారీగా తరలిరావాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం ప్రాంగణంలో శోభాయాత్ర కోసం తీర్చిదిద్దుతున్న శ్రీరాముని విగ్రహ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, ఉత్సవ సమితి అధ్యక్షుడు రాళ్ల బండి మహేందర్, రఘుపతి, కళాకారులు రవి, విజయ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్సీవాడను సందర్శించారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. దశలవారీగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బీఆర్ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, కాంగ్రెస్ నాయకులు మీర్జా యాకుబ్‌బేగ్, కొరెంగా సుంకట్‌రావ్, ఎండీ మసుద్, జహిర్, జితేందర్ పాల్గొన్నారు.

'ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం'



మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

ఉట్నూర్‌రూరల్: మాట ఇచ్చిన ఆరు నెలల్లోనే రాష్ట్రానికి రెండు ఎయిర్‌పోర్టులను తీసుకువచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం ఏమి చేసిందని ప్రశ్నించారు. ఎయిర్‌పోర్టుకు అనుమతులు మీరే తీసుకువస్తే ఆదిలాబాద్‌లోని సీసీఐ కూడా తెరిపించే బాధ్యత తీసుకోవాలన్నారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఒక్క అడుగు ముందుకు వేయలేదన్నారు. 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేంద్ర మంత్రి జైరాంరమేశ్ చొరవతో ఇక్కడ ఎయిర్‌పోర్టు ఆశలు చిగురించాయన్నారు. సమావేశంలో నాయకులు సోమేరే నాగోరావు, సునీల్, బీర్‌షావ్, విశాల్, రాజక్క, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్సై

ఆదిలాబాద్‌రూరల్: సైబర్‌నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్ అన్నారు. పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని అర్లీకోరీ గ్రామంలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ ఫణిధర్ మాట్లాడుతూ తెలియని నంబర్ల నుంచి ఫోన్ వస్తే స్పందించ వద్దన్నారు. ఏదైనా ఇబ్బంది ఉంటే డయల్ 100కు కాల్ చేయాలని, మహిళలకు ఏవైనా అన్యాయాలు జరుగుతుంటే షీటీంను సంప్రదించాలన్నారు. వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దన్నారు. గంజాయి విక్రయించడం, సేవించడం నేరమన్నారు. కార్యక్రమంలో ఎస్సై ముజాహిద్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేయిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నార్నూర్: భారత రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాలేపూర్ గ్రామంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. భారత రాజ్యాంగాన్ని, అంబేడ్కర్‌ను అపహాస్యం చేస్తూ బీజేపీ నాయకులు పార్లమెంట్‌లో మాట్లాడడం సరికాదన్నారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు లోఖండే దేవురావు, బానోత్ ప్రణీత, షేక్ దాదే అలీ, పరమేశ్వర్, దుర్గే కాంతారావు, కైలాస్ నాయక్ పాల్గొన్నారు.

గంటపాటు నిలిచిన రాకపోకలు



గేటు వేసి ఉండడంతో ప్రమాదకరంగా దాటుతున్న వాహనదారులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జందాపూర్ గ్రామం సమీపంలో రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ వంతెన లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రైలు వస్తున్న సమయంలో రైల్వే గేటు వేస్తే అటు వైపు నుంచి వెళ్లే ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. రైలు వస్తున్న క్రమంలో పది నుంచి పదిహేను నిమిషాలు గేటు వేస్తారు. కానీ శుక్రవారం గంట పాటు రైల్వే గేటు వేయడంతో వాహనాదారులు మండుటెండల్లో ఇబ్బంది ఎదుర్కొన్నారు. విషయాన్ని ప్రయాణికులు రైల్వే బోర్డు సభ్యుల దృష్టికి తీసుకెళ్లడంతో గేట్ తీశారని పలువురు ప్రయాణికులు పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

ఆదిలాబాద్‌టౌన్: బేల మండలంలోని బాధి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. యువత స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మనోహర్, ప్రమోద్ కుమార్, గంభీర్, సతీష్, తేజరావు, మధుకర్, అరుణ్, వివేక్, తన్వీర్, పోతారెడ్డి, దయాకర్, భానుచందర్ పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): మట్కా స్థావరంపై దాడులు చేసిన మట్కా నిర్వాహకుడిని అరెస్టు చేసినట్లు జైనథ్ ఎస్సై పురుషోత్తం తెలిపారు. జైనథ్ గ్రామ శివారులో మట్కా నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు గురువారం ఏఎస్సై సిరాజ్, కానిస్టేబుళ్లు సందీప్, స్వామిలతో కలిసి దాడి చేయడం జరిగిందని పేర్కొన్నారు. మట్కా నిర్వహిస్తున్న కొటకు చెందిన ప్రమోద్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ.5వేలు, సెల్ ఫోన్‌తో పాటు అందులోని మట్కా చీటీలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ క్వార్టర్స్ ఏరియా వద్ద పేకాడుతున్న తొమ్మిది మందిని శుక్రవారం సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.39,600 నగదు, తొమ్మిది సెల్‌ఫోన్లు, ఏడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఈవో



పూలమొక్క అందజేస్తున్న డీఈవో శ్రీనివాస్ రెడ్డి

కైలాస్‌నగర్: జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలిసి పూలమొక్క అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట సెక్టోరియల్ అధికారులు జి.నారాయణ, శ్రీకాంత్ గౌడ్, కందుల గజేందర్ ఉన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న సెడ్మకి సుభాష్

ఆదిలాబాద్‌రూరల్: అభిమాన్యు గ్రూప్ సభ్యుడైన ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు సెడ్మకి సుభాష్ అత్యవసర సమయంలో రక్తదానం చేసి ఓ చిన్నారి ప్రాణాన్ని కాపాడారు. సిర్పూర్(యూ) మండలం భూర్నూర్ గ్రామానికి చెందిన ఆరేళ్ల వయస్సు గల అంజలి అనే చిన్నారి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో చికిత్స పొందుతుంది. ఆమెకు 'ఏబీ పాజిటీవ్' రక్తం అవసరం ఉందని వైద్యులు సూచించడంతో కుటుంబీకులు అభిమాన్యు గ్రూప్ సభ్యులను సంప్రదించారు. స్పందించిన ఆయన రిమ్స్ ఆస్పత్రికి చేరుకొని రక్త దానం చేశారు.

ఎంపీడీవో పర్యటన



ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: మండలంలోని కేశవపట్నంలో శుక్రవారం ఎంపీడీవో లక్ష్మణ్ పర్యటించి వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ప్రజల అవసరాల మేరకు భగీరథ నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు ఎవరూ కూడా భగీరథ పైపులైన్‌కు రంధ్రాలు చేసుకొని నీటిని తీసుకోవద్దన్నారు. అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

నేరడిగొండ: మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో జొన్న, మొక్కజొన్న, నువ్వు పంటలను నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఆకుల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.30 వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఫసల్ బీమా పథకాన్ని వర్తింపజేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గాదె శంకర్, గట్టు నారాయణ, ఆడెపు నరేందర్, బంటు ప్రవీణ్, రాజేందర్ రెడ్డి, ఏరు రాజేశ్వర్, పరశురాం జాదవ్, మహేందర్ రెడ్డి, ధృవ రాజు, రంజిత్ పాల్గొన్నారు.

రేపు ఆదివాసీ విద్యార్థి సంఘం సదస్సు

ఆదిలాబాద్‌టౌన్: ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 6న ఉట్నూర్‌లో ఆదివాసీ భవన్‌లో జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కన్వీనర్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు–ప్రభుత్వ నిర్లక్ష్యం అనే అంశంపై సదస్సును నిర్వహించడం జరుగుతుందన్నారు. కాకతీయ యూనిర్సిటీ ప్రొఫెసర్ ఈసం నారాయణ, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సిడాం జంగుదేవ్, అశోక్, తుడుందెబ్బ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. ఆదివాసీల సంఘాల ప్రజాప్రతినిధులు, రాయి సెంటర్ సర్మేడీలు, పటేల్, దేవారి తెగపెద్దలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో త్రిమూర్తి, మోతిరాం, రాంచందర్, విశ్వ, కిషెరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఏజీపీ శంకర్

బోథ్: ప్రతిఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు ఏజీపీ పంద్రం శంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పట్నాపూర్ గ్రామంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు వారి నిజ జీవితంలో చట్టాల గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇన్సూరెన్స్, హెల్మెట్, వాహనం పత్రాలు తప్పకుండా కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తొడషం గోపాల్, మాజీ ఉప సర్పంచ్ కైలాష్ పటేల్, నీలకాంత్ రావ్, పూజారి కుంరం గంగారాం, దుర్వ రాంచందర్ పాల్గొన్నారు.

ఈద్గా వద్ద అభివృద్ధి పనులు

బోథ్: మండల కేంద్రంలోని ఈద్గా వద్ద రూ.10 లక్షలతో నిర్మించబోవు పలు అభివృద్ధి పనులను బోథ్ కాంగ్రెస్ ఆడె గజేందర్, బోథ్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బొడ్డు గంగారెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా వక్ఫ్ బోర్డుపై మోదీ ప్రభుత్వం అజమాయిషీ చేయాలని చూస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పసుల చంటి, గొర్ల రాజు యాదవ్, షేక్ నాజర్ అహ్మద్, మహమ్మద్ పాల్గొన్నారు.

తాగునీటికి తండ్లాట..!



ఇచ్చోడ మండలంలోని దూబార్‌పేట్‌లో తాగునీటి కోసం ప్రజలు తండ్లాతున్నారు. మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయ బావులను ఆశ్రయిస్తూ.. కిలో మీటర్ల దూరంలో నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు ప్రత్యేక చొరవ చూపి తాగునీటి సమస్యను పరిష్కారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. – ఇచ్చోడ

వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



నిరసన తెలుపుతున్న ముస్లింలు

బోథ్: మండల కేంద్రలోని గుల్జార్ మసీదులో ముస్లింలు శుక్రవారం వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. వక్ఫ్ సంస్థల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తాయన్నారు. ప్రభుత్వం బిల్లును పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతరులను చేర్చడం, వక్ఫ్ యాజమాన్యాన్ని నిర్ణయించడానికి ప్రభుత్వ అధికారులకు అధికారాన్ని బదిలీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.